155) శంకరాభరణం

ప|| నీవు సర్వసముడవు నీవు దేవదేవుడవు। యీవల నాగుణదోషా లెంచ నికనేలా ||

చ|| పూవులపై గాసీ బొరి ముండ్లపై గాసీని। ఆవల వెన్నెలకేమి హానివచ్చీనా।
పావనుల నటు గాచి పాపపుంజమైననన్ను। గావగా నీకృపకు గడమయ్యీనా ||

చ|| గోవుమీద విసరీ గుక్కమీద విసరీని। పావనపుగాలికిని పాపమంటీనా।
దేవతలరక్షించి దీనుడనైననాకు। దోవచూపి రక్షించితే దోసమయ్యీనా ||

చ|| కులజునియింటనుండీ కులహీనునియింటనుండీ। యిలలో నెండకు నేమి హీనమయ్యీనా।
వలసి శ్రీవేంకటాద్రి వరములు యిచ్చి నాలో। నిలిచి వరములిచ్చి నేడు గావవే ||